మూషికం.. నష్టదాయకం

- రబీ వరి పైరుపై ఎలుకల దాడి ప్రారంభం
- పిలక దశలో సార్వా పంట
- ఆందోళనలో అన్నదాతలు

రాయవరం: రబీ వరి నాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం వరి పంట పిలక దశలో ఉంది. కష్ట నష్టాలను భరిస్తూ వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రకృతి పరంగా కలిగే నష్టాలతో పాటు ఎలుకలు కూడా నష్టాన్ని తెచ్చి పెడుతున్నాయి. ఎలుకలు తినేదాని కన్నా ఎనిమిది రెట్లు వరకు ధాన్యాన్ని అధికంగా పాడు చేస్తూ నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ ఏడాది కూడా వరిపైరుపై ఎలుకలు దాడి చేయడం ప్రారంభించాయి. ప్రస్తుతం వరి పిలక దశలో ఉంది. మరికొద్ది రోజుల్లో వరి పైరు చిరుపొట్ట దశకు చేరుకుంటుంది. ఎలుకల దాడి కారణంగా రైతులు ఏటా పంట దిగుబడిని కోల్పోతున్నారు. ఎలుకల దాడి నుంచి రైతులను కాపాడేందుకు ఇదే సమయంలో వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం బ్రోమోడయలిన్ మందును సరఫరా చేయాల్సి ఉంది. చిరుపొట్ట దశలోనే ఎలుకల నివారణకు వ్యవసాయ శాఖ ద్వారా ఈ మందును సరఫరా చేసి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల పరిధిలో 98 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. రబీలో 95 శాతం మేర వెదజల్లు సాగును చేపట్టారు. మిగిలిన ఐదు శాతం మాత్రం సాధారణ పద్ధతిలో వరినాట్లు వేశారు. రైతులు అధిక శాతం ఎంటీయు 3626(బొండాలు) రకాన్ని సాగు చేయగా, తక్కువ విస్తీర్ణంలో 1001, 1010 తదితర రకాలను సాగు చేశారు.


వరి పొలంలో పొగ పెట్టే విధానంలో ఎలుకల పట్టివేత

ఒక్కో ఎలుక పట్టివేతకు రూ.50

చిలుకలు జామపళ్లను కొరికినట్లుగా ఎలుకలు వరి దుబ్బులను కొరికి పంటకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. వీటిని అదుపు చేయడం కోసం రైతులు పలు మార్గాలను అవలంబిస్తున్నారు. ప్రస్తుతం వరి పంట దుబ్బు కట్టే దశ నుంచి పిలక దశకు చేరుకుంది. వరి నారుమడి దశ నుంచి ఎలుకలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. వరి దుబ్బులను అదేపనిగా కొరికి వేయడంతో పంటకు నష్టం కలుగుతుంది. రైతులు ఎలుకలను బుట్టల సహాయంతో, పొగపెట్టే విధానంతో మట్టుబెట్టే చర్యలు చేపడుతున్నారు. వీటి బెడద ఎక్కువగా ఉండడంతో ఎలుకలు పట్టేవారికి డిమాండ్ కూడా అధికంగానే ఉంది. ఒక్కో ఎలుకకు రూ. 50 వరకు చెల్లిస్తున్నారు. ఎలుకలు పట్టడానికి ఎకరానికి సుమారు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. వరి పంట చిరుపొట్ట దశలో దుబ్బు తీపెక్కుతుంది. ఆ సమయంలో ఎలుకలు వరి పంటను మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయి. అందుకే ప్రతి ఏటా ప్రభుత్వం చిరుపొట్ట దశకు ముందుగానే ఎలుకల నివారణకు బ్రోమోడయలిన్ మందును ఉచితంగా సరఫరా చేస్తోంది.

సరఫరా చేసేదెప్పుడో

వ్యవసాయ శాఖ ఖరీఫ్, రబీ సీజన్లలో ఎలుకల నివారణకు బ్రోమోడయలిన్ మందును రైతులకు ఉచితంగా సరఫరా చేస్తోంది. గత ఖరీఫ్‌లో ఎలుకల నివారణ మందును సామూహికంగా రైతులకు పంపిణీ చేశారు. ప్రస్తుత రబీలో కూడా ఎలుకల నివారణకు బ్రోమోడయలిన్ మందును సరఫరా చేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టాల్సి ఉంది. సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టడం వలన ప్రయోజనం ఉంటుందని అధికారులు రైతులకు చెప్పడమే కాక ప్రతి సీజన్‌లో సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుత రబీలో ఎలుకల దాడి ఉధృతమవుతున్న దశలో సామూహిక ఎలుకల నివారణ చేపట్టడం వలన ప్రయోజనం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని రైతులకు వ్యవసాయ శాఖ ఈ మందును సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. క్లస్టర్ పరిధిలోని ఆయా మండలాల్లో 27,700 మంది రైతులకు బ్రోమోడయలిన్ మందును సరఫరా చేయాల్సి ఉంది. మరో పక్క కలుపులు తీసుకునే హడావిడిలో రైతులు నిమగ్నమయ్యారు.

మందు పంపిణీకి చర్యలు



ప్రస్తుతం ఎలుకల ఉధృతి ప్రారంభమవుతోంది. ప్రారంభంలోనే ఎలుకల నివారణకు చర్యలు చేపడతాం. గతానికి భిన్నంగా ఈ ఏడాది పిలక దశలోనే బ్రోమోడయలిన్ మందును సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

కొప్పిశెట్టి ప్రభాకర్,
మండల వ్యవసాయాధికారి, రాయవరం.

క్లుప్తంగా

వీరాంజనేయుని సన్నిధిలో సీనియర్ సివిల్ జడ్జి

రామచంద్రపురం: పట్టణంలోని రాజగోపాల్ సెంటర్‌లో వేంచేసి యున్న శ్రీ సీతారామ భక్త వీరాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ మోహన్ వెంకటరమణ, ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ సీనియర్ న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అక్కిరెడ్డి శ్రీను, దొడ్డ ప్రసాద్, పడాల బాబి తదితరులు ఆయనకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. స్వామి వారి చిత్ర పటాన్ని అందజేశారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా పుట్టాలమ్మ జాతర


పూజలందుకున్న పుట్టాలమ్మ

కె.గంగవరం: మండలంలోని పామర్రులో గ్రామ దేవత పుట్టాలమ్మ జాతర మహోత్సవంతో పాటు తీర్థాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలను అలంకరించారు. తీన్‌మార్, బుట్ట బొమ్మలు, కోయ డ్యాన్సు, గరగ నృత్యాలు, బ్యాండు మేళాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నుంచి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తీర్థానికి భక్తులు పోటెత్తారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


శిబిరంలో పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత పాడి రైతులు పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, సర్పంచ్ పిల్లి రాంబాబులు సూచించారు. మండల పరిధిలోని యర్ర పోతవరం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పశు వైద్యులు గ్రామంలోని పశువులకు గర్భకోశ, చూడి పరీక్షలు చేపట్టారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్‌తో పాటు పలు రకాల మందులు అందించారు. గ్రామ పెద్దలు రాయిపురెడ్డి విశ్వేశ్వర సీతారామయ్య, వాసంశెట్టి సత్తిబాబు, మాకినీడి సత్యనారాయణ, రాంబాబు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

మాచవరంలో ఉచిత వైద్య శిబిరం


రోగులకు మందుల పంపిణీ

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ కత్తుల సీతా మహాలక్ష్మి ప్రారంభించారు. మండపేటకు చెందిన పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ, నారాయణరెడ్డి ఆసుపత్రుల సౌజన్యంతో స్థానిక పంచాయతీ ఆవరణలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సాధారణ వైద్య సేవలు, చెవి, ముక్కు, గొంతు, జనరల్ సర్జరీలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యులు మాధురి, ప్రసాద్, వైద్య సిబ్బంది ప్రకాష్, కోటి, మణి, వంశీ, స్టీఫెన్, చిట్టి చిన్నారిలు వైద్య సేవలు అందించారు. పంచాయతీ కార్యదర్శి శ్యామసుందరం, మాజీ ఎంపీటీసీ కత్తుల అప్పారావు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: కాకినాడ–కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం ఆర్యావటం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ రమణయ్యపేటకు చెందిన చీకాలపు సత్యమూర్తి తన మోటారు బైక్‌పై ద్రాక్షారామ వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆర్యావటం వాటర్ ట్యాంక్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపై నడచి వెళ్లుతున్న ఓ వ్యక్తి అడ్డుగా రావటంతో అకస్మాత్తుగా బ్రేకు వేశాడు. దీంతో బైక్ పల్టీలు కొట్టడంతో సత్యమూర్తి గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి అతడిని కాకినాడ ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

అభివృద్ధి పనులకు భూమి పూజలు

- రూ.60 లక్షల ఎంపీ నిధులతో పనులు ప్రారంభం

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడు పంచాయతీ పరిధిలోని మామిడిగుంట, ముచ్చెరువు, గణపతినగరం గ్రామాలకు సంబంధించిన శ్మశాన వాటిక అభివృద్ధికి రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీ బోస్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, గ్రామ సర్పంచ్ రాయుడు సీతా మహాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామ పెద్దలు ఎంపీ బోస్, సూర్యప్రకాశ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు నరాల ఏడుకొండలు, వాసంశెట్టి శ్యామ్, అనిశెట్టి రామకృష్ణ, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.


మామిడిగుంటలో శ్మశానవాటిక అభివృద్ధికి నిర్వహించిన భూమిపూజలో ఎంపీ బోస్, కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని కందులపాలెం శివారు గొల్లల చెరువు గ్రామంలో ఎంపీ నిధులు రూ.20 లక్షలతో మేజర్ డ్రైన్ నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌లు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలో మెయిన్ డ్రైన్ లేక ఎన్నో అవస్థలు పడేవాళ్లమన్నారు. సమస్యను ఎంపీ బోస్ దృష్టికి తీసుకుని వెళ్లి నిధులు కేటాయించేలా కృషి చేసిన యువ నాయకుడు వయిట్ల హరికిషన్, గ్రామ సర్పంచ్ పెంకే కృష్ణవేణి, ఎంపీటీసీ గుత్తుల అచ్చుతవేణిలు, నిధులు మంజూరు చేసిన ఎంపీ బోస్, సూర్యప్రకాశ్‌లను గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వయిట్ల రాజబాబు, ఉప సర్పంచ్ వెంటపల్లి రామకృష్ణ, మాజీ సర్పంచ్ వెంటపల్లి శేషారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.


గొల్లలచెరువులో మేజర్ డ్రైన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ బోస్, సూర్యప్రకాశ్

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి


గొల్లపాలెంలో వాటరింగ్ చేయకుండా వదిలేసిన సీసీ రోడ్డు

కాజులూరు: గొల్లపాలెం–కుయ్యేరు రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రామాణాలు పాటించాలని స్థానికులు కోరుతున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ హయాంలో గొల్లపాలెం–కుయ్యేరు రహదారి నిర్మాణానికి రూ. 37 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్డు మధ్యలో పలు కల్వర్టులు, వంతెనలు పునర్నిర్మించారు. మూడున్నర మీటర్ల వెడల్పు గల రోడ్డును ఏడు మీటర్ల వెడల్పు చేశారు. ఎన్నికల ముందు నిలిచి పోయిన పనులు ఎట్టకేలకు ఇటీవల పునఃప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రోడ్డు ముఖద్వారమైన గొల్లపాలెంలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. అయితే పనులు జరిగే సమయంలో కాంట్రాక్టరు, సిబ్బంది మినహా అధికారులేవ్వరూ ఉండటం లేదని రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా సీసీ రోడ్డు నిర్మించిన తర్వాత కొన్ని రోజుల పాటు రోడ్డుపై గడ్డి కప్పి నిత్యం నీటితో తడుపుతుండాలి. అయితే ఇక్కడ సీసీరోడ్డు నిర్మించిన అనంతరం కాంట్రాక్టరు ఎటువంటి వాటరింగ్ చేయకుండా వదిలేశారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ ఉండేవిధంగా చూడాలని, నాణ్యత ప్రమాణాలు సక్రమంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని గొల్లపాలెం గ్రామ ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, పాలకవర్గ సభ్యులు పెంటపాటి శ్రీను, వీరబాబు తదితరులు కోరుతన్నారు.

ఆర్పీలపై ఆరోపణల రగడ

చర్యలు తీసుకోవాలని పట్టుపట్టిన కౌన్సిలర్లు

రామచంద్రపురం: పట్టణంలోని పలు వార్డుల్లో రుణాలు ఇప్పించేందుకు రూ.10 వేలు అడుగుతున్నారని, గతంలో కూడా పలు మార్లు ఇలాగే జరిగిందని అటువంటి ఆర్పీలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్‌లు అంకం శ్రీనివాస్, బావాల మంగామణి తదితరులు కౌన్సిల్ సమావేశంలో కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 12 అంశాలను కౌన్సిల్ ముందుకు తీసుకురాగా వాటిని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం అంకం శ్రీనివాస్, బావాల మంగామణి తదితరులు మాట్లాడుతూ పట్టణ పరిధిలో కొంత మంది ఆర్పీల పనితీరు బాగోలేదని రూ.10 వేలు ఇస్తేనే రుణం ఇప్పిస్తామని చెబుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై గతంలోనే ఫిర్యాదు ఇవ్వటం జరిగిందని తెలిపారు. దీనిపై మెప్మా సీవో శ్రీనివాస్ సమాధానం ఇస్తూ ఇప్పటికే కమిషనర్ ద్వారా ఉన్నతాధికారులకు ఆర్పీల ఆరోపణలపై నివేదించామని త్వరలోనే విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే దీనిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కౌన్సిలర్ సాయిప్రసాద్ మాట్లాడుతూ ఏడాదిలో మున్సిపల్ సమావేశాల ఖర్చు రూ.2 లక్షలు చూపించటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటిపన్ను రశీదు వేరే పేరుపై ఉందంటూ సాకు చెప్పి తాగునీటి పైపు కనెక్షన్లు ఇవ్వటం లేదన్నారు. వెంటనే అధికారులు జోక్యం చేసుకుని కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. కమిషనర్ అయ్యప్పనాయుడు మాట్లాడుతూ ఎటువంటి అభ్యంతరాలు లేని దరఖాస్తుదారులకు వెంటనే పైప్‌లైన్‌లు ఇస్తామని చెప్పారు. కో ఆప్షన్ సభ్యులు మస్తాన్ మాట్లాడుతూ హిందూ, ముస్లిం శ్మాశాన వాటికలను అభివృద్ధి చేయాలని కోరారు. వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.


మున్సిపల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్ పర్సన్ శ్రీదేవి, కమిషనర్ అయ్యప్ప నాయుడు

వెన్నెముక ఆరోగ్యంపై డ్రైవర్లు శ్రద్ధ చూపాలి

రావులపాలెం: రహదారి ప్రయాణంలో వెన్నెముకకు గాయమైతే అటువంటి వారు కొన్ని సమయాల్లో మంచానికే పరిమితమై కుటుంబానికి భారంగా మారే ప్రమాదం ఉందని డ్రైవర్లు, వాహనదారులు ఆరోగ్యం పట్ల వెన్నెముకపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రముఖ వెన్నెముక వైద్య నిపుణుడు తేజో ఫణీంద్ర అన్నారు. మండలంలోని ఈతకోట టోల్‌ప్లాజా వద్ద మంగళవారం 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాజమహేంద్రవరం వేద ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రాజెక్ట్ మేనేజర్ కె.బాలసుబ్రహ్మణ్యం, టోల్ మేనేజర్ కర్రి వీవీ సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో రాజమహేంద్రవరం వేద హాస్పిటల్ వైద్యుడు తేజో ఫణీంద్ర (ఆర్థోపెడిక్–స్పైన్ స్పెషలిస్ట్), డాక్టర్ లక్ష్మీమృదుల (గైనిక్ స్పెషలిస్ట్) పలువురు వాహనదారులకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో 108 మంది వాహనదారులకు, రోడ్ వినియోగదారులకు, స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అలాగే రూ.2,500 విలువైన ఎముకసాంద్రత పరీక్షలను ఉచితంగా చేశారు.

నేలటూరులో మాస శివరాత్రి పూజ


అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరులో మంగళవారం మాస శివరాత్రి పూజను వైభవంగా నిర్వహించారు. స్థానిక నీలాంబికా సమేత బసవేశ్వర స్వామి ఆలయ కల్యాణ మండపంలో నిర్వహణా కమిటీ ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాల విజయలక్ష్మి మనుమలు ముత్యాల వెంకట సందీప్ కల్యాణ్, శ్రీనివాస్ ఆర్థిక సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఓం శివ నామాన్ని జపించారు.

నీటి పంపిణీ కమిటీ కార్యవర్గ సమావేశం

రామచంద్రపురం: రామచంద్రపురం నీటి పంపిణీ కమిటీ తొలి సమావేశం స్థానిక నీటి పారుదల శాఖ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ జగన్నాథం, ఆరు నీటి వినియోగదారుల సంఘాల చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తొలుత అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నీటి పంపిణీ కమిటీ పరిధిలో వివిధ నీటి వినియోగదారుల సంఘాలు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ రామకృష్ణ, డీఈఈ వి రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతా నియమాలతో ప్రమాదాల నివారణ

రాయవరం: రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందని రామచంద్రపురం ఎంవీఐ ఆర్.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రాయవరం భాష్యం పాఠశాలలో మంగళవారం రహదారి భద్రతా నియమాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రహదారి నిబంధనలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మైనర్లు వాహనాలు నడపడం వలన కలిగే అనర్థాలు, ప్రమాదాలకు కారణమైన మైనర్లకు చట్టం విధించే శిక్షలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు రహదారి భద్రత అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో మిధున్, సుమంత్ సాయి, త్రివిక్రమ్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాస గుప్తా, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంవీఐ రాజేంద్రప్రసాద్

రాజ్యాంగంపై అవగాహన అవసరం

మండపేట: విద్యార్థి దశ నుంచి భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని బీజేపీ టౌన్ కన్వీనర్ మద్దుల సుబ్బారావు అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ (రాజ్యాంగ సమ్మాన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిద రోడ్డులోని ఎస్‌వీఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎల్‌ఈడీ స్క్రీన్‌పై భారత రాజ్యాంగ విశిష్టతను తెలియ పరిచారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కోసం విద్యార్థులు తెలుసుకొని, హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అంబేడ్కర్, భరతమాత చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు రావూరి బాబూరావు, సందక సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠశాలలో స్క్రీన్‌పై రాజ్యాంగ హక్కులను విశదపరుస్తున్న నాయకులు

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలి

కపిలేశ్వరపురం: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అన్నారు. టేకి, వల్లూరు గ్రామాల్లో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. టేకిలో సర్పంచ్ నాగమణి, ఎంపీపీ సత్యవేణి, వల్లూరులో సర్పంచ్ దాసి మీనా కుమారి శిబిరాలను ప్రారంభించారు. ఆయా శిబిరాల్లో పశువైద్యులు రమణమూర్తి తదితరులు పశువులకు నట్టల నివారణ, గర్భ కోశ వ్యాధులకు చికిత్స చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై కోళ్లకు టీకాలు వేస్తామన్నారు. పశువులకు మూడు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మేడిశెట్టి దుర్గారావు, పశు సంవర్థక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


టేకిలో పాడి రైతుకు మందులు అందజేస్తున్న ఎంపీపీ సత్యవేణి

ఆధార్ నవీకరణతో పారదర్శకత

కపిలేశ్వరపురం: ఆధార్ నవీకరణతో వ్యక్తిగత రికార్డుల్లో పారదర్శకత ఉంటుందని ఎంపీడీఓ కె.రత్న కుమారి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ చిన్నారుల ఆధార్ కార్డుల్లో వివరాలను నవీకరించే లక్ష్యంగా మంగళవారం అంగర, కోరుమిల్లి, వెదురుమూడి సచివాలయాల్లో నవీకరణ శిబిరాలను నిర్వహించారు. ఆయా శిబిరాల్లో చిన్నారుల ఆధార్ వివరాలను డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, అల్లక ఫణీంద్ర, కోరా దొరబాబు నవీకరణ చేశారు. బుధవారం నేలటూరు, కోరుమిల్లి, అంగర గ్రామాల్లో శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు.

పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టల్ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగులు

మండపేట: అధిక వడ్డీని కల్పించే తపాలా శాఖలోని పొదుపు పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్ మాస్టర్ ఎంపీ సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. తపాలా శాఖ ద్వారా లాభం చేకూర్చే పొదుపు పథకాలపై మండలంలోని మారేడబాక, పట్టణంలోని పలు వీధుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. పోస్ మాస్టర్ సుబ్బారెడ్డి ఆదేశాలతో తపాలా ఉద్యోగులు కొండపల్లి సూర్యనారాయణ, కేవీ నారాయణరావు (బాబి)లు ఇంటింటికీ తిరిగి అధిక వడ్డీని ఇచ్చే పొదుపు పథకాలను వివరించారు. ఫైర్ స్టేషన్, పార్వతీ నగర్, ఆనంద్ నగర్, మహిళా నగర్ కాలనీల్లోని ప్రజలను చైతన్య పరిచారు. సుకన్య సమృద్ధి యోజన టైం డిపాజిట్, రికరింగ్ డిపాజిట్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, గ్రామీణ తపాలా బీమా వంటి పథకాలను వివరించి ప్రజలను ఆకర్షింప జేశారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఆంధ్రా బ్యాంకు వీధిలో ఉన్న తపాలా కార్యాలయంలో రామచంద్రపురం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కామేశ్వర రావు ఆధ్వర్యంలో పొదుపు పథకాలపై ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తపాలా ఉద్యోగులు ఎండీఎం షరీఫ్, సిద్ధిరెడ్డి దుర్గాదేవి, ఏ అనూష, చెల్లుబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.